# కసి

అయితే ఏమంటారు ? అక్కడికి ఇంటెడు చాకిరీ మీరూ, మీ పెద్ద కోడలూ చేస్తున్నట్టు... నేను కూర్చుని తింటున్నట్టు- అంతేగా మీరనేది !" జానకి నోరు చేసుకుంది.

"ఎందుకు జానకీ చిలవలకు పలవలు ? ... ఇప్పుడు నేను మాత్రం ఏమన్నానని ?" అత్తగారు గొణిగింది.

"పెద్దవాళ్ళు మీరేమన్నా వూరుకోవాలి. తిరిగి సమాధానం చెప్తే చెడ్డవాళ్ళం-అయినా నే చేసేపనికి మీరేనాడు వంకపెట్టలేదు గనుక-"

"సరేలేమ్మా- నీతో ఏది మాట్లాడినా తప్పే-సరేనా. అబ్బాయి వచ్చే వేళకూడా అయింది. నువెళ్ళి పనిచూచుకో."

జూలై '67 కృష్ణాపత్రికలో ప్రచురితము

"ఏమిటే శాంతా! ఎందుకీ ఘర్షణ ... రామ రామ కొంపలో కాస్సేపన్నా శాంతి లేదుగదా..." మామగారి కంఠం ధ్వనించింది.

"అదేమంటే ఇదొకటి. మీరంతా మంచివాళ్ళే ... నేనే గయ్యాళిదాన్ని...అనండి...అనండి."

"నిన్నన్లేదు జానకీ-"

"ఎందుకనరు! నాకేం క్రొత్తగనకనా. ఎవరిని అంటు న్నారో తెలుసుకోలేనివాళ్ళం గాదు..." రుసరుసలాడుతూ ఇంట్లోకెళ్ళింది జానకి.

♦ ♦ ♦

"జానకీ! ఏమిటట్లావున్నావ్?" భర్త పరామర్శ...

"ఏముందీ...రోజు వుండేదే..."

"అంతేగదా-చూడు. అమ్మ ఏదో అన్నదే అనుకో... నువ్వు కాస్త సర్దుకుపోగూడదూ?"

"అనండి మీరూ నన్నేగా అనేది."

"అదిగాదు జానకీ..."

"మీరు నాకేం చెప్పనక్కర్లేదు. ఇంటెడు చాకిరీ నే నొక్కదాన్నే చేస్తున్నా మెప్పులేకపోగా..."

"నువ్వొక్కదానివే యెట్లా చేస్తున్నావు చెప్పు! అవ తల అమ్మా, వదినా వున్నారుగదా? అంతా కలిసే చేసు కోండి."

"మీరు లక్ష చెప్పండి, నేనేది చేసినా మీ వాళ్ళకు నచ్చదు-అయినా యిందరికోసం నే నొక్కత్తెనే యెందుకు చేయాలి?"

"అందరూ అంటే ... నువ్వేం పరాయివాళ్ళ పని చెయ్యటం లేదుగదా ?"

"నా మంచితనం అక్కరకు రానప్పుడు ఈ ఇంట్లో అంతా నాకు పరాయివాళ్ళే—"

'జానకీ ! ఏమిటినువ్వు మాట్లాడేది ? అమ్మా నాన్నా పరాయివాళ్ళా !- మన ఇంట్లోపని మనం చేసుకోవటంకూడా తప్పేనా?'

'నేను నాజూగ్గా వుంటం... మంచి చీర కట్టుకోవటం ఇష్టం లేనప్పుడు, పరాయి వాళ్లెందుకు కారు?- వంట్లో కులాసా లేక ఓపూట పడుకుంటే... దానికి శాపనార్థాలు, తిట్లూ... అంతేగా !- వీటన్నిటికి నోరు మూసుక్కూర్చుంటే మంచివాళ్ళు... అదేమని అడిగితే చెడ్డవాళ్ళు.'

'చూడు జానకీ! ప్రతి చిన్నవిషయానికి ఇంట్లో ఘర్షణ పడటం ఏం బావుంటుంది చెప్పు, ఎవరో వకరు సర్దుకు పోవాలి'

'అదేమాట మీ అమ్మగారి కెందుకు చెప్పలేరు ? నా నోరు మూయించకపోతే...,

'చిన్నదానివి నువ్వు వూరుకుంటె సరిపోదూ ?'

'అవున్లెండి అన్నిటికి నానోరే మూస్తారు. కనీసం ఇంట్లో నోరెత్తి మాట్లాడేందుకైనా స్వతంత్రంలేదు.'

'నే చెప్పేది నువ్వర్థం చేసుకోవటం లేదు.

"నే చెప్పేదీ అదే, ఇక ఈ ఇంట్లో బ్రతకటం నాచేత గాదు..."

"అయితే ఇంకేం! పదిరోజులపాటు పుట్టింట్లో గడిపిరా"

"ఏం? మిమ్మల్ని వదలి పుట్టింటి కెందుకెళ్లాలి?- మీ సంపాదన ఇంటిల్లిపాది తినచ్చుగానీ... నేను మాత్రం పుట్టింటికి పోవాలి."

"జానకీ! నలుగురం కావాలని కల్సివుంటున్నప్పుడు తినక యెక్కడికి పోతారు?-"

"ఎక్కడికైనా పోనీండి. నాకనవసరం. నన్ను మాటలంటే మాత్రం పడను. తర్వాత మీ రేమన్నానసరే."

"సరే...సరే... కాస్త నోరు తగ్గించు!- అందరూ నిద్దర్లు పోతున్నట్టున్నారు."

"అవును అటు వాళ్ళతో మాట్లాడేందు కెట్లాగూ వీల్లేదు... ఇటు మీరూ నన్నేగా అనేది."

'మీరూ మీరూ యేగంగలోనైనా దూకండి... మధ్య నేనెందుకు తల దూర్చటం... నే పడుకుంటాను.

♦ ♦ ♦ ♦

చినుకులతో ప్రారంభమైన వర్షం గాలీవానకు గురవుతోంది—

సాయంత్రం ఐదుగంటల సమయం.

"ఏరా చిన్నా ఎందు కేడుస్తున్నావు?" దొడ్లో నుండి పంచలోకొస్తూ ఏడుస్తున్న కొడుకుని చూచి అడిగింది జానకి.

'ఆ...మీ మామగారు కొప్పడితేను..."

అత్తగారు వాక్యం పూర్తి చేసేలోపల "కోప్పడితే ఇట్లా యెందు కేడుస్తాడు వెక్కిళ్ళొచ్చేట్టు!... కొట్టేవుంటారు" అంటూ పిల్లాడిని దగ్గరకు తీసుకుంది.

"అప్పనమ్మా నేనే కొట్టేను ఏం? పిల్లవాడు తప్పు చేస్తే కొట్టేందుకూ—డా హక్కు—లేదా!–" మామగారి స్వరం శ్రుతి సందుకుంది.

'ఎందుకులేదు. అందరికీ హక్కు—ంది. ఎటొచ్చినా వక్క—దానికే హక్కు—లేంది ఈ ఇంట్లో–'

'జానకీ తప్పమ్మా! ఈ చిన్న విషయానికి హక్కు—లు, వారసత్వాలదాకా ఎందుకు పోతావ్ ?–'

"మీరన్న మాటేగా!—అడ్డమైన వాళ్ళూ నాబిడ్డను చెండుకు తినచ్చుగానీ... నేనేదైనా మాట్లాడితేనే వస్తుండి– అయినా... వకరి ననేంలాభం—ఏరా చిన్నా? నీకిదేం పోయేకాలంరా?... అందరికీ పుట్టినట్టు నీకూ పుట్టిందీ!—"

పసివాడిని కొడుతూ కసి తీర్చుకో నారంభించింది జానకి.

"ఏమిటి నాన్నా ఏం జరిగింది?" ఆఫీసునుంచి ఇంట్లో కొస్తూ పంచలో జరుగుతున్న భాగవతం చూచి అడిగాడు ప్రభాకరం.

"ఏ ముందిరా... మామూలే..." గొణిగాడు తండ్రి.

భర్త రావటం చూచిన జానకి చిన్నవాడి వీపుమీద మరిరెండు గట్టిగా వడ్డించింది.

"ఎందుకట్లా వాడిని చంపుకుతింటావ్ ?'

'ఎందుకా?– నాపిల్లవాడూ, నేనూ పచ్చగా తిరుగుతున్నందుకు. ఓర్వలేనివాళ్ళు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటు మన్నందుకు."

భార్యమీద చెయ్యి చేసుకున్న ప్రభాకరం 'నీకేమైనా పిచ్చెక్కిందా? ఎవ్వరు కానివాళ్లు నీకు. అమ్మా నాన్న యేగా? నీకు కాకుండా పోతారేమో... నీగురించి మనల్ని కాదనుకుని వాళ్ళెక్కడికి పోతారు? అయినా గోరంతలు కొండంతలెందుకు చేస్తావ్? ఛ...ఛ పాడు కొంప! చిన్న దానికి నీకూ బుద్ధిలేదు... పెద్దవాళ్ళు అంతకంటె వూరు కోరు..." అనేసి చరచరా ఇంట్లోకెళ్ళేడు.

వాన వెలిసింది. రాత్రికి జానకికి జ్వరం వచ్చింది. నిద్రలో కలువరిస్తోంది. ఆహారమేమీ తీసుకోవటంలేదు.

పళ్ళరసమైనా తీసుకోమని అత్తగారు మరీమరీ చెప్పింది. ఇంటిప్రక్క డాక్టరుగారితో మామగారు చెప్పించినా ప్రయో జనం లేకపోయింది.

ప్రభాకరం పలుకరించినా మాట్లాడదు. వంట్లో బాధే మిటో యెవ్వారికీ చెప్పదు.

డాక్టరిచ్చే ఇంజక్షన్ మినహా... ఏ ఇతర మందులు గానీ, మాత్రలుగానీ తీసుకోదు.

వంట్లో అస్వస్తతకంటె... మానసిక వ్యథ జానకిని రోజు రోజుకూ కృంగదీస్తోంది.

వారం రోజులు గిర్రున తిరుగొచ్చినా జానకిలో సుగుణం కన్పించలేదు.

ఇంట్లో అలజడి బయల్దేరింది. ప్రభాకరం యింట్లో వారిమీద విరుచుకు పడ్డాడు. జానకి అనారోగ్యానికి కారణం

ఇంట్లో అలజడేనని తెలుసుకున్న ప్రభాకరం భార్య అనారోగ్యంపట్ల ఆదుర్దా పడసాగేడు.

అసలారోజు జానకిమీద చెయ్యి చేసుకున్నందుకు తనను నిందించుకున్నాడు.

కళ్ళు తెరుచుకు మంచంమీద పడుకున్న జానకి దగ్గరగా కూర్చుని 'తొందరపాటుకు క్షమించవూ?' అంటూ జాలిగా జానకి కళ్ళల్లోకి చూసేడు ప్రభాకరం.

చేతగాని వాడివన్నట్టు జానకి కంటిలోనుండి జాలువారి చెక్కిళ్ళమీద ప్రవహిస్తున్న కన్నీరు సమాధానం చెప్పింది.

జానకి తిరిగి మళ్ళీ ఆరోగ్యవంతురా లెప్పుడవుతుందాని రాత్రిం బవళ్ళు ప్రభాకరం దిగులు పడసాగేడు.

అహర్నిశలు చిన్ని జానకి మంచాన్ని అంటిపెట్టుకొని వుండటం, ఆమె ఓదార్పు లేక వాడు ఏడవటం చూచి ప్రభాకరం హృదయం బద్ద లయ్యేది. పిల్లవాడిని దగ్గరకు తీసుకుంటూ అశ్రుపూరితనయనాలు తుడుచుకునేవాడు.

మనోవ్యాధే జానకి అనారోగ్యానికి కారణమని డాక్టర్ చెప్పినప్పుడు, ఆమె బాధకు, వ్యధకు కారణం ప్రభాకరం వూహ కందలేదు.

డాక్టర్ చెప్పిన పిడుగులాంటి వార్త ప్రభాకరం నరనాల్నీ కృంగదీసింది.

తెల్లవార్లూ జానకి మంచం ప్రక్కనే కూర్చుని తల నిమురుతూ మూగ బాధ ననుభవించసాగేడు.

అత్త మామలు కంగారు పడసాగారు. జానకి అనారోగ్యంపట్ల విచారిస్తూ వుపచారాలు చేస్తూ వచ్చారు.

ప్రభాకరం మనసు యెక్కడ పాడవుతుందోనని ఆదుర్దా కూడా యెక్కువవుతోంది వారిలో—

♦ ♦ ♦ ♦

మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తోంది.

గదిలో కూర్చుని ఏదో వ్రాసుకుంటున్న ప్రభాకరం దగ్గర కొచ్చిన తల్లి "ఒరే అబ్బాయ్! జానకి యెన్ని పిలిచినా పలకటం లేదురా–నా కేదో భయంగా వుంది. నువ్వోమారు వచ్చిచూడు" అంది.

గబగబా లేచి జానకి మంచం దగ్గర కెళ్ళేడు. పరిస్థితి అర్థంగాక కంగారుగా డాక్టర్ దగ్గరకు పరుగెత్తాడు.

జనరల్ హాస్పిటల్లో క్యాజువాలిటి వార్డులో చేర్చిన గంటకు గాని జానకికి స్పృహ రాలేదు.

"డాక్టరుగారూ! మరేం ప్రమాదం లేదుగదా?" చెమట పట్టిన ముఖాన్ని తుడుచుకుంటూ ఆదుర్దాగా అడిగేరు సుందరరామయ్యగారు.

"ఏం డాక్టర్? మాట్లాడరేం?–" అన్న ప్రభాకరం కంఠం జీర వోయింది.

"సారీ! పెద్ద ప్రమాదమే జరిగింది. పేషెంటు ఆత్మహత్య చేసుకో ప్రయత్నించింది."

"డాక్టర్! హౌఈజిట్?" అంటున్న ప్రభాకరం గుండె ఆగినంత పనైంది.

"అయినా ఇప్పుడే మనమేం చెప్పలేం ... ముందు పోలీసు రిపోర్టు ఇవ్వాలి. ఆమె స్టేట్‌మెంట్ మీద తర్వాత పరిస్థితులు ఆధారపడి వుంటయ్ ... ఐ కెనాట్ హెల్ప్ ..." అనేసి మరో వార్డులో కెళ్ళిపోయాడు డాక్టరు.

ఆత్మహత్య-పోలీసు రిపోర్టు-కేసు అనే మాటలు వినే సరికి సుందర్రామయ్యగారి హృదయం గాభరాతో కొట్టు మిట్టాడింది.

ప్రభాకరం నోట మాటరాక స్తంభించిపోయాడు. చేజారుతున్న గుండెను కుదుట బర్చుకునే శక్తి క్షణ క్షణానికీ కోల్పోతున్నాడు ప్రభాకరం.

సాయంత్రం ఆరుగంటలకు జానకి కళ్ళు తెరచి చుట్టూ వున్నవాళ్ళను కలయచూచి మళ్ళీ కళ్లు మూసుకుంది అప్ర యత్నంగా.

"ఎట్లావుంది జానకీ!" ప్రభాకరం అడిగేడు.

"ఏవమ్మా వంట్లో యెట్లావుంది?" దీనంగ అడిగేరు సుందర్రామయ్యగారు.

ఎంతకీ జానకి పలక్కపోవటం చూచి పెద్దడాక్టర్‌కోసం పరుగెత్తాడు ప్రభాకరం.

సుందర్రామయ్యగారికి మనసులో మనసు లేదు. శాంతమ్మ గుడ్లనీరు కుక్కుకుంది. ఇక చిన్నవాడి ఏడుపు అంతా ఇంతా కాదు.

జానకి కళ్ళు తెరిచింది.

సుందర్రామయ్యగారిలో ఆదుర్దా అవధులు దాటు తోంది. ఆత్రంగా జానకి కళ్ళల్లోకి చూచారు.

ప్రక్కనేవున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ జానకి వాఙ్మూలం కోసం యెదురుచూస్తున్నాడు.

మామగారివైపు వెర్రిగా చూస్తున్న జానకి "క్షమిం చండి మామగారు. నన్నూ నా భర్తను సుఖపడనీయకుండ, మమ్మల్ని విడికాపురం పెట్టనీయలేదనే కోపంతో ఈ విధంగ చేయాల్సి వచ్చింది. మీ మీద కక్ష సాధించాలనే వుద్దే శ్యంతో ...స్లీపింగ్ మాత్రలన్నీ ఒకేమారు తినేశాను ... యెట్లాగూ మీ అందరిమధ్య సుఖపడలేని నేను... ఈ విధంగా నైన కసితీర్చుకోవాలనుకున్నాను ..." అనేసి ఆఖరి మాటలూ నాలుగు చెప్పి శాశ్వతంగ కన్నుమూసింది.

అంతా గొల్లుమన్నారు వొక్కసారిగ—